క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రేగిడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభించారు. ఏటా వేసవి సెలవుల్లో విద్యార్థులు అరు బయట అనవసరంగా తిరిగి, వారి ఆరోగ్యం, చదువు పాడవ్వకుండా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పుస్తకాలు, కథలు, చదివించడంతో పాటు మంచి మంచి విజ్ఞాన విషయాలు చెప్పడం జరుగుతుందని, అలాగే వక్తృత్వ, వ్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ సూర్యప్రకాష్

రేగిడి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సూర్యప్రకాష్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. నిర్మాణాలు చేస్తున్న వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీడీఓ కాశీవిశ్వనాధరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలతో సిబ్బంది

రేగిడి: మండలంలోని ఎమ్మార్సీకి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు సోమవారం చేరుకున్నాయి. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి, మొత్తం 19,853 పాఠ్యపుస్తకాలు, మరో 37,856 నోటు పుస్తకాలు వచ్చాయని, వీటిని త్వరలో ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ అబ్జర్వర్ ఎం.మంగమ్మ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోవాలి

బొబ్బిలి: జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతి బాగా ఉందని.. అయినప్పటికీ మరింత వేగవంతంగా నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో 2,823 ఇళ్లకు గాను 538 ఇళ్లు పూర్తవగా.. 1664 ఇళ్లు బేస్‌మెంట్, 187 రూఫ్ లెవెల్, 42 శ్లాబు దశలో ఉన్నాయన్నారు. మిగిలిన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ డీఈఈ ఎస్‌జీపీ రత్నాకర్, ఏఈ అల్లు సూర్యనారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఓ. వరప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

వంగర: గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజేష్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని రుషింగి గ్రామంలో తాగునీటి రిగ్‌బోరును పరిశీలించిన ఆయన మడ్డువలస ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా చేయలేకపోయామని, తక్షణమే రిగ్‌బోరు ఏర్పాటు చేసి, తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని గ్రామాల్లో క్రాస్ ప్రోగ్రాం ద్వారా ఇప్పటికే తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టి, సకాలంలో తాగునీరు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మిశ్రీనివాస్, జేఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు

బొబ్బిలి: డివిజన్‌లోని అన్ని ఆర్‌బీకేల ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు మజ్జి శ్యామ్ సుందర్ అన్నారు. మండలంలోని పారాది ఆర్‌బీకే వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెయ్యి కింటాళ్ల జనుము, పిల్లిపెసర, జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, వ్యవసాయ సహాయకురాలు రేజేటి ఉష, పలువురు రైతులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం..

- ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం ఒక్క వైఎస్సార్‌సీపీయే
- డిప్యూటీ సీఎం రాజన్నదొర



ఉద్దంగిలో లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రాజన్నదొర

మెంటాడ: ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తామని, ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చామని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని ఉద్దంగి, కూనేరు, రేగులపాడు, పెద్దపాడు గ్రామాలలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన తండాలైన రేగులపాడు, పెద్దపాడు ప్రాంతాలకు కొండలపై నుంచి నడుచుకుంటూ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను బడికి పంపుతున్నారా, లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటుందన్నారు. గిరిజన తండాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు తామెప్పుడూ ముందుంటామని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిల్ని దశల వారీగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల శ్రేయస్సు కోరి ప్రతి పంచాయతీలోనూ ఆర్‌బీకే కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయం మంచి ఆదాయ మార్గంగా మలిచామని చెప్పారు. ప్రధానంగా గిరిజన పిల్లల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్నారని తెలిపారు. గిరిజన గ్రామాలైన కేఎల్ వలస, కూనేరు, ఉద్దంగి గ్రామాలకు మధ్యలో నిలిచిపోయిన తారురోడ్డు నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలతో ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. కార్యక్రమానికి ముందుగా మంత్రి రాజన్నదొరకు స్థానిక గిరిజనులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీరాములు, కొర్రాయి లక్ష్మి, హనుమంతరాజు, బుజ్జి, సంతోష్, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, నాయకులు లెంక రత్నాకర్‌నాయుడు, మయూర్ అప్పలనాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు, చప్ప మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన కేంద్రాలు వినియోగించుకోవాలి



బొబ్బిలి: వేసవి విజ్ఞాన తరగతిలో పాల్గొన్న చిన్నారులు



బాడంగి: గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం వేసవి విజ్ఞాన కేంద్రాలు (చదవడం మాకిష్టం) ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గ్రామాల్లోని గ్రంథాలయాల్లో సోమవారం నుంచి 35 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయకుండా చదువుపై మనసు లగ్నం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడనుంది. పాటలు, కథలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్స్, తదితర అంశాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

– బాడంగి/బొబ్బిలి/రామభద్రపురం/ తెర్లాం

'స్పందన' సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి హాజరైన ఆయన పలువురు సమర్పించిన అర్జీలు స్వీకరించి, పరిశీలించారు. అనంతరం వారి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రెడ్‌క్రాస్ ద్వారా సేవలు విస్తృతం

రాజాం సిటీ: రెడ్‌క్రాస్ ద్వారా సేవలను విస్తృతం చేయాలని తహసీల్దార్ పి.విజయభాస్కర్, ఎంపీడీఓ బాసూరి శంకరరావులు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తొలుత హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజాం ప్రాంతమే కాకుండా జిల్లా వ్యాప్తంగా రెడ్‌క్రాస్ కార్యక్రమాలు విస్తరింపజేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరుగ్గా మరమ్మతులు

తెర్లాం: క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా మండలంలో పాడైన బోరుబావులకు చురుగ్గా మరమ్మతులు చేపడుతున్నారు. మండలంలోని పలు గ్రామా ల్లో సోమవారం మరమ్మతులు చేట్టారు. గ్రామా ల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆదేశాల మేరకు క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు సత్కారం

రేగిడి: పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను మండల కేంద్రంలో సోమవారం సత్కరించారు. హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు, జ్ఞాపికలు బహూకరించి, సన్మానించారు. ఇంటర్మీడియట్, డిగ్రీలో కూడా ఇదే స్ఫూర్తి కనబరచాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు.

సమాజ సేవకు ముందుకు రావాలి

రేగిడి: సమాజ సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని హైదరాబాద్‌కు చెందిన గీతాశ్రమం ఆధ్యాత్మిక వక్త మామిడి చిరంజీవినాయుడు కోరారు. స్థానిక మండల కేంద్రంలో విశ్వసాయి మందిరం ఎనిమిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు చేసి, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన సత్యసాయి మందిరాలు ఏర్పాటు చేసుకుని, ప్రతిరోజూ పూజలు, సేవా కార్యక్రమాలు చేయాలని, తద్వారా మోక్షమార్గం పొందవచ్చన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తేనే గిట్టుబాటు వేతనం

సంతకవిటి: నిర్దేశిత కొలతల్లో పనిచేస్తేనే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి వేతనదారులకు సూచించారు. సోమవారం మండలంలోని వాసుదేవపట్నం గ్రామంలో సాయన్న ధాసల్ దగ్గర జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలని, పనిలో ఉన్న వారికే మస్తరు వేయాలన్నారు. బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ త్రినాధరావు, ఈసీ మురళి పాల్గొన్నారు.

మూడు రోజుల్లో వేతనాలు

రామభద్రపురం: రెండు, మూడు రోజుల్లో గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ రమామణి తెలిపారు. సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేతన బకాయిలు చెల్లించాలని మండల పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లు సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు అర్ధ నగ్నంతో భిక్షాటన చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమామణి మాట్లాడుతూ, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించామని, సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైందన్నారు.

వాహన తనిఖీలు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను పరిశీలించారు. ఉండాల్సిన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మద్యం సేవించి, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం

రేగిడి: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణే ధ్యేయంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రేగిడి గ్రామంలో క్రాస్ ప్రోగ్రాంను వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు సోమవారం ప్రారంభించారు. తమ పంచాయతీ పరిధిలో మరమ్మతులకు గురైన అన్ని తాగునీటి బోర్లను బాగు చేసి, మళ్లీ వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

రాజాం: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని ఆగూరు గ్రామంలో మరమ్మతులకు గురైన బోర్లను సోమవారం బాగుచేసి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. వేసవి నేపథ్యంలో గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మెకానిక్‌లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

రణస్థలం: భవన నిర్మాణ కార్మికుడు పని చేస్తున్నచోటే కుప్పకూలిపోయి మృతి చెందాడు. ఈ విషాద ఘటన కోష్ట గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకోగా.. విజయనగరం జిల్లా రాజాం మండలం రాజేపేట గ్రామానికి చెందిన బి.సంతోష్ (30) ప్రాణాలు కోల్పోయాడు. సంతోష్ కోష్టలోని మందిరం సమీపంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేటి నుంచి ఆలయ ప్రారంభోత్సవాలు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, శ్రీసత్యనారాయణస్వామి, నవగ్రహాల, దత్తాత్రేయ, నాగబంధ, షిర్డీసాయి, సత్యసాయి ఆలయాల ప్రారంభోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మే 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో తొలిరోజు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు, రెండో రోజు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు, మూడో రోజు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం రేలారే రేలా ప్రదర్శన ఉంటుందన్నారు.

10న పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం ఈ నెల 10వ తేదీన లెక్కించనున్నామని ఈఓ బీవీ మాధవరావు సోమవారం తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో ఈ లెక్కింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- డీఎస్పీ పుల్లారు శ్రీధర్

బొబ్బిలి: శాంతి,భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని డీఎస్పీ పల్లారు శ్రీధర్ అన్నారు. సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా నియమితులైన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ, డీఐజీలను మర్యాదపూర్వకంగా కలిశారు.

పీడీఎస్ బియ్యం అమ్మితే కార్డు రద్దు

రాజాం సిటీ: ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని(పీడీఎస్ బియ్యం) లబ్ధిదారులు అమ్మితే కార్డు రద్దు చేస్తామని సీఎస్‌డీటీ చిరంజీవరావు ఓ ప్రకటనలో సోమవారం హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా బియ్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుతోందని, ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

పార్టీని నమ్ముకున్న వారికి సముచిత స్థానం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌లను సత్కరిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ మరిశర్ల విజయలక్ష్మి గంగారావు తదితరులు

వంగర: వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి పార్టీ అధిష్టానం ఎప్పుడూ సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శివ్వాం పీఏసీఎస్‌కు కొత్తగా నియమితులైన పీఏసీఎస్ చైర్‌పర్సన్ మరిశర్ల విజయలక్ష్మి గంగారావు, డైరెక్టర్ పర్సన్స్ కె.రామారావు, గాడి మధు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు పార్టీలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, మండల విప్‌గా, జేసీఎస్ కన్వీనర్‌గా పనిచేస్తూ ఎనలేని సేవలందించిన మరిశర్ల విజయలక్ష్మి గంగారావును పార్టీ గుర్తించి, ఈ పదవి కట్టబెట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం మరిశర్ల విజయలక్ష్మి, డైరెక్టర్ పర్సన్స్ కె.రామారావు, జి.మధు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేషముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీలు పున్నాన సత్యన్నారాయణ, కిమిడి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: మహిళా సాధికారితే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిధిలోని ఎం.సీతారాంపురం గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళల టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మూడు నెలలు టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, కొత్త బ్యాచ్‌కి వెల్‌కమ్ కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్‌తో మహిళలు స్వయం ఉపాధి పొంది, తద్వారా కుటుంబానికి బాసటగా నిలుస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిట్లు నెలకొల్పేందుకు వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేస్తారన్నారు. పీఎంఈజీసీ ప్రోగ్రాం ద్వారా బీసీలకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం సబ్సిడీతో యూనిట్లు ఏర్పాటు చేసి, అవసరమైన రుణం ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేషముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కాంబోతుల కళావతి, కర్రి సుగుణమ్మ, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఆలుగోలు చిరంజీవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో అలసత్వం తగదు



బాడంగిలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అక్కారావు



రామభద్రపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి



తెర్లాం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

బాడంగి: ప్రజలు తెలియజేసిన వినతుల పరిష్కారంలో అలసత్వం తగదని ఎంపీడీఓ కె. అక్కారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయాల ద్వారా వచ్చిన వినతులను కార్యదర్శులు వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మీ పరిధిలో పరిష్కారం కానప్పుడు మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్,ఎవెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, శ్రీదేవి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఉండకూడదు..

రామభద్రపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని.. స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని ఎంపీడీఓ రమామణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, స్పందన ద్వారా తెలియజేసిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు.

సకాలంలో పరిష్కరించాలి..

తెర్లాం: జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో భాగంగా ప్రజలు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి స్పందన కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్య ధోరణి కనబరచవద్దని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఎంఈఓ త్రినాధరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



చుక్కవలసలో లబ్ధిదారుకి బుక్‌లెట్ అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి



రాజాం: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రాజాం: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని సత్యనారాయణపురం సచివాలయ పరిధిలో ఉన్న బాబానగర్, గాంధీనగర్, సాయికృష్ణానగర్, సర్సునాయుడు కాలనీల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజానం క్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపకూ లబ్ధి జరుగుతోందన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్‌కుమార్, గొర్లె దాలినాయుడు, నారాయణరావు, కాసవు వేణుగోపాలనాయుడు, దూల గోపాలం, చిన్న, సతీష్, పాలవలస శ్యామ్, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ నాగరాజు, ఏఈ రత్నాకర్, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాజగోపాల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తెర్లాం: గ్రామాల్లో అర్హులైన వారందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చుక్కవలస, వి.చిన్నయ్యపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, వలంటీర్లు, గ్రామపెద్దలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాల నగదు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమవుతున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న జగనన్న ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తెర్లాం మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాళ్జీరావు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, వి.చిన్నయ్యపేట సర్పంచ్ చప్ప రాము, ఎంపీటీసీ సభ్యుడు చింత సింహాచలం అప్పారావు, పాములవలస సర్పంచ్ చప్ప రాధ ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు టి. సత్యంనాయుడు, బి.అప్పలనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.